క్లుప్తంగా

పల్నాడు కలెక్టర్ శివశంకర్‌కి సత్కారం



సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా వైద్యశాలలో కంటి వైద్యంకు సంబంధించి పరికరాలు కావాలని ఇటీవల సత్తెనపల్లిలో జరిగిన స్పందన కార్యక్రమంలో హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు కొత్త రామకృష్ణ, సయ్యద్ ఖాజాలు కోరి కలెక్టర్ శివశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. దీని పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అడిగిన 20 రోజుల్లోనే కంటి ఆపరేషన్ సంబంధించిన పరికరాలను హాస్పిటల్ కి అందజేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కొత్త రామకృష్ణ, సయ్యద్ ఖాజాలు శుక్రవారం నరసరావుపేటలో కలెక్టర్ శివశంకర్‌ను కలిసి కంటి పరికరాలు అందించినందుకు చిరు సత్కారం చేశారు. కలెక్టర్ శివ శంకర్ మాట్లాడుతూ హాస్పిటల్ కి కావాల్సిన అన్ని విషయాలలోనూ సహకారం అందిస్తానని తెలియజేశారన్నారు. మరికొన్ని పరికరాలు వస్తే కంటికి సంబంధించి ఆపరేషన్ మొదలు పెడతారని ఆ పరికరాలు కూడా అతి త్వరలోనే హాస్పిటల్ కి వచ్చే విధంగా చూస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారన్నారు.

ఏఎన్‌యు వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఇరువురి విద్యార్థులు ఎంపిక



షేక్ లాల్‌బషీర్



పావని కుమారి

సత్తెనపల్లి: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు పట్టణంలోని అన్నం గురవమ్మ కృష్ణమూర్తి కళాశాలకు చెందిన ఇరువురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల పురుషుల, మహిళ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ఈనెల 12న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాల వారు నిర్వహించారు. ఈ పోటీల్లో ఏజీకేఎం కళాశాల బిఏ ద్వితీయ సంవత్సర విద్యార్థి, వెయిట్ లిఫ్టర్ షేక్ లాల్ బషీర్ 89 కిలోల పురుషుల విభాగంలో స్నాచ్ లో 130 కిలోలు, క్లీన్, జర్క్‌లో 164 కిలోలు మొత్తం కలిపి 294 కిలోలు బరువు నెత్తి బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. అలాగే బిఏ తృతీయ సంవత్సరం విద్యార్థిని, వెయిట్ లిఫ్టర్ కె.వి.ఎల్ పావని కుమారి 45 కిలోల మహిళల విభాగంలో స్నాచ్ లో 68 కిలోలు ప్లస్, క్లీన్,జర్క్‌లో 80 కిలోలు బరువు నెత్తి బంగారు పతకాన్ని దక్కించుకుంది. ఇరువురు విద్యార్థులు విశ్వవిద్యాలయ జట్టుకు ఎంపికై విశ్వవిద్యాలయం తరఫున ఈ నెల 27 నుంచి కేరళలో జరిగే ఆలిండియా అంతర్ విశ్వవిద్యాలయల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొననున్నారు. ప్రతిభ చూపిన వెయిట్ లిఫ్టర్లను శుక్రవారం కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు అన్నం సత్యనారాయణ, సెక్రటరీ అన్నం బ్రహ్మం, సభ్యులు అన్నం కృష్ణ ప్రసాద్, అన్నం రామారావు, ప్రిన్సిపాల్ రామిశెట్టి శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ దాసరి కోటేశ్వరరావు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు, వాకర్స్ సభ్యులు అభినందించారు.

బొల్లవరంలో ఫ్యామిలీ ఫిజీషియన్



బొల్లవరం(ముప్పాళ్ళ): మండలంలోని బొల్లవరం గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు వి.సూర్యప్రకాశరావు, జయకృష్ణ లు పాల్గొని 58 మందికి వైద్య సేవలందించారు. బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమైన వారి ఇళ్ళకు వెళ్ళి వైద్య సేవలందించారు. సూపర్‌వైజర్లు ఏ.పీటర్‌డానియేన్, జోస్పిన్ రాణి, ఎమ్ఎల్‌హెచ్‌పీ సుగుణ, కమల, ఏఎన్‌ఎమ్ అనురాధ, డీఈఓ రవితేజ, చంద్రశేఖర్, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు గాంధీ చౌక్ సెంటర్‌లో భోగి వేడుకలు

సత్తెనపల్లి: పట్టణంలోని గాంధీ చౌక్ సెంటర్‌లో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం ఐదు గంటలకు భోగి పర్వదిన వేడుకలు జరుగుతాయని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు శుక్రవారం తెలిపారు. భోగి పండుగను పురస్కరించుకుని భోగి మంటలు వేయడం, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హాజరవుతారన్నారు. ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పేదల సంతోషమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



లబ్ధిదారులకు పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి(పెదకూరపాడు): మూడున్నరేళ్ల పాలనలో ప్రతి గ్రామంలో అభివృద్ధి, ప్రతి ఇంటికి సంక్షేమం అందించి పేదల కుటుంబాల్లో సంతోషాలు నింపాలని జగనన్న నిరంతరం కృషి చేస్తున్నాడని పెదకూరపాడు శాసన సభ్యుడు నంబూరు శంకరరావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పాడపాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే పలు ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే పథకాలు అమలు తీరును గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఇంకా ప్రభుత్వ పథకాలకు అర్హులైన వారందరికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామస్తులు అడిగిన సమస్యలపై అక్కడిక్కడే అధికారులతో చర్చించి పరిష్కారాలను సూచించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ కుల, మతం, పార్టీ, వర్గాలు చూడకుండా అందరికి అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ప్రభుత్వ పథకాలు రావాలంటే జన్మభూమి కమీటీల వారికి లంచాలు ఇవ్వాల్సిన దుస్థితి ఉండేదన్నారు. టీడీపీ హయాంలో ప్రజలను గాలికొదిలేసి నేడు బాదుడే-బాదుడు, ఇదేం ఖర్మరా అంటూ ప్రజల్లోకి వెళితే ఆదరణ లేక టీడీసీ నవ్వులుపాలౌతుందన్నారు. నిత్యం నియోజవర్గంలో ప్రజలతో మమేకమై వారి కస్టాలను పంచుకుని ప్రభుత్వం ద్వారా అర్హులైన లబ్ధి దారులందరికి సంక్షేమసాయం అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి తేడా గమనించి సంక్షేమ పాలన నరంతరం కొనసాగాలంటే ప్రజలు సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డిని, తనకు అండగా ఉండి మళ్లీ ఆశీర్వదించాలన్నారు.

పాడపాడులో 9.15 కోట్ల రూపాయల సంక్షేమాభివృద్ధి...

పాడపాడు గ్రామంలో తమ ప్రభుత్వం మూడున్నరేళ్లలో సుమారు రూ.9.15 కోట్ల రూపాయల సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేశామని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, మాజీ ఎంపీపీ సాంబిరెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మస్తాన్ షరీఫ్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు చాంద్‌బాషా తదితరుల తోపాటుగా ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, పార్టీనేతలు, కార్యకర్తలు హాజరయ్యారు.

వైభవంగా గోదారంగనాధుల కల్యాణం



ఆలయంలో శ్రీగోదాదేవి, శ్రీరంగనాధస్వామి వార్ల కల్యాణ వేడుక



రాజుపాలెం వెంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

రాజుపాలెం: రాజుపాలెంలో వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీగోదారంగనాధుల కల్యాణ మహోత్సవ వేడుకలు రంగరంగ వైభవంగా శుక్రవారం నిర్వహించారు. వేదపండితులు రవితేజాచార్యులు, హస్వంత్ దీక్షితులు వేదమంత్రాలతో, మంగళవాయిద్యాల మధ్య కల్యాణం నిర్వహించారు. కళ్యాణంలో దేవస్థానం దర్మకర్తలు పొత్తూరి సుబ్బారావు, వెంకటరమణ దంపతులు కల్యాణ మహోత్సవంలో పాల్గొని కల్యాణం నిర్వహించారు. ఈ కళ్యాణంలో సుమారు 25 మంది దంపతులు పాల్గొని కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం వేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు, భజనా కార్యక్రమాలు నిర్వహించారు.

మొక్కులు తీర్చుకున్న ప్రభుత్వ విప్ జంగా...

వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో కల్యాణం అనంతరం శాసన మండలి ప్రభుత్వ విప్ జంగా కృష్ణ మూర్తి ప్రత్యేక మొక్కలు తీర్చుకున్నారు. దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ పొత్తూరి వెంకటరమణసుబ్బారావు, పూజారి కిషోరాచార్యులు జంగాను వేద మంత్రాల నడుమ పూర్ణకుంభంతో దేవస్థానంలోకు ఆహ్వానించారు. జంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా, పూజారి తీర్థప్రసాదాలు అందించారు.

గోదాదేవి, శ్రీరంగనాధస్వామివార్ల కల్యాణ వేడుక

నకరికల్లు: స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో శ్రీగోదాదేవి, శ్రీరంగనాధ స్వామివార్ల కల్యాణ వేడుక శుక్రవారం కన్నుల పండువగా జరిపించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ కల్యాణ వేడుక కమనీయంగా సాగింది. పలువురు దంపతులు పీటలపై కూర్చొని కల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. ధనుర్మాసం పురస్కరించుకుని అర్చకులు కొండవటికంటి మధుసూధనాచార్యులు, పాండురంగాచార్యులు, శ్రీకాంతాచార్యులు ఆధ్వర్యంలో స్వామివార్లకు విశ్వక్షేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, హోమములు, అభిషేకాలు జరిపించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి పూజాధికాల్లో పాల్గొనాలన్నారు.

స్వామివార్ల పంచలోహ విగ్రహాలు ఏర్పాటు



భక్తుల సహకారంతో ఏర్పాటు చేసిన పంచలోహ విగ్రహాలతో ఆలయ కమిటీ నిర్వాహకులు

నకరికల్లు: భక్తుల సహకారంతో శ్రీగోదాదేవి, శ్రీరంగనాధ స్వామివార్ల పంచలోహ విగ్రహాలు సమకూర్చినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు చందోలు ప్రకాశరావు తెలిపారు. స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో శ్రీగోదాదేవి, శ్రీరంగనాధస్వామివార్ల పంచలోహ విగ్రహాలను శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో గత 30 ఏళ్లగా ధనుర్మాసవేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేడుకల్లో భాగంగా స్వామివార్ల కల్యాణం నిర్వహించేందుకు శ్రీగోదాదేవి, శ్రీరంగనాధస్వామి వార్ల పంచలోహ విగ్రహాలు సమకూర్చినట్లు తెలిపారు. భోగిరోజు ఆలయంలో కన్నులపండువగా కల్యాణ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విగ్రహాలు సమకూర్చేందుకు సహకరించిన భక్తులందరికీ ఆలయ కమిటీ తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తిరువీధుల శ్రీనివాసరావు, కోట శ్రీనివాసరావు, ఆతుకూరి హనుమంతరావు, జాలకంటి సతీష్, కూరపాటి రామగురవయ్య, జూలకంటి నాగేశ్వర రావు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు



వీఆర్వోలకు సూచనలిస్తున్న తహసీల్దార్ సురేష్

నకరికల్లు: సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో కోడి పందేలు నిర్వహించకుండా అప్రమత్తంగా ఉండాలని వీఆర్వోలకు తహసీల్దార్ ఎస్. సురేష్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వీఆర్వోల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగను బంధుమిత్రులతో, సుఖసంతోషాలతో జరుపుకోవాలని ప్రజలకు సూచించారు. చట్టవ్యతిరేకంగా కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. వీఆర్వోలు కార్యాలయాల్లో విధిగా బయోమెట్రిక్ హాజరు నమోదు చేసుకోవాలన్నారు. కుల, ధృవీకరణపత్రాల దరఖాస్తులు విచారణ జరిపి సత్వరమే కార్యాలయానికి పంపాలన్నారు. రైస్‌కార్డు దరఖాస్తుల ఈ-కేవైసి పెండింగ్ లేకుండా పూర్తిచేయాలన్నారు. సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ముప్పాళ్ళ: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఎవరైనా కోడిపందేలు నిర్వహిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎమ్.భవాని శంకర్ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, వీఆర్వోలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కోడిపందేలు, జంతువులను బాధించడం, బెట్టింగ్‌లను నిర్వహించకుండా గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ అధికారి, పోలీసు, గ్రామరెవెన్యూ సహాయకులతో టీములు ఏర్పాటు చేశామన్నారు. ఆయా టీములు గ్రామాల్లో ఎటువంటి ఘటనలు చోటు చేసుకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, ఆయా గ్రామాల వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రోటరీ, కన్స్యూమర్ రైట్స్ క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: రోటరి క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి, ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్ రైట్స్ ప్రొడక్షన్ ఫోరం సత్తెనపల్లి డివిజన్ వారి ఆధ్వర్యంలో 2023 వ సంవత్సరం క్యాలెండర్లను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో 24 వ వార్డు కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్, రోటరీ క్లబ్ జిల్లా సమన్వయకర్త బెల్లంకొండ నాగ సాయి ప్రసాద్, అధ్యక్షుడు పాయసం మహేష్ బాబు, ట్రెజరర్ స్వామినాథన్ బాలసుబ్రమణ్యం, రోటరీ క్లబ్ డైరెక్టర్లు సరికొండ రమాదేవి, మాతంగి సాంబశివరావు,దారా జాషువా, ఏపీ కన్స్యూమర్ రైట్స్ ప్రొడక్షన్ ఫోరం ప్రతినిధులు తుమ్మల వెంకటేష్, ఆవులమంద కమలాకర్, వేల్పూరి పవన్ కుమార్, సయ్యద్ మస్తాన్ వలి, దార్ల లక్ష్మయ్య, మాతంగి రాహుల్ గౌతమ్, షేక్ సుభాని,రేవంత నాథ్, జి ఆదిశేషరెడ్డి, తదితరులు ఉన్నారు.

అపూర్వం..ఆత్మీయం..ఈ సమ్మేళనం



రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

- 40 ఏళ్ళ తర్వాత మిత్రుల కలయిక
- ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్న స్నేహితులు
- రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావుకు సన్మానం
- పాఠశాల గ్రంథాలయాభివృద్ధికి సహకరిస్తా

అమరావతి: ఎంతో చరిత్ర కల్గిన అమరావతి శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్‌లో ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదివి పది తరగతి పరీక్షలు అయ్యాక విడిపోయారు. జీవితంలో విభిన్నదారుల్లో సాగి వివిధ వృత్తులు, ఉద్యోగాలు, వ్యాపారాలు, రాజకీయాల్లో రాణించారు. జీవితం యాంత్రికమై, ఒక్కసారి చిన్ననాటి స్నేహితులను కలుసుకోవాలని సంకల్పించారు. రాష్ట్రం నలుమూలల్లో ఉన్న సుమారు 100 మంది చిరునామాలు సేకరించారు. శుక్రవారం వారు చదువుకున్న పాఠశాలలో ఒకే వేదిక పైకి చేరుకున్నారు. 1980 నుంచి 81 సంవత్సరాల మధ్య పాఠశాలలో చదువుకున్న వారు 40 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనంతో తిరిగి కలుసుకున్నప్పుడు ఒక్కసారిగా అందరిలో ఉద్వేగం... ఆనందం అపురూపమైన ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పరస్పర పలకరింపులు, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆనాడు తరగతులలో తాము చేసిన చిలిపి పనులు, మాష్టార్ల దండనలు, మందలింపులు, హితభోదలు ఒకరికొకరు చెప్పుకుని ఆనందంగా గడిపారు. తామంతా సుమారు 40 ఏళ్ళ క్రితం ఆడిపాడిన పాఠశాలకు వచ్చేసరికి ఒక్కసారిగా చిన్న పిల్లలుగా మారి ఆనాటి ముచ్చట్లలో చెప్పుకుని మురిసిపోయారు. అందరు ఫోన్ నంబర్లు, చిరునామాలు సేరించుకున్నారు. తమ ఉన్నతికి దోహదపడిన ఆనాటి గురువులను సన్మానించారు. స్నేహ బంధానికి గుర్తుగా గ్రూప్ ఫొటోలు దిగారు.

మందపాటి శేషగిరిరావుకు సన్మానం...

ఈసందర్భంగా తమతో పాటు కలిసి చదువుకున్న రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావును తోటి విద్యార్థులు శ్రీ రామకృష్ణ హిందూ హైస్కూల్ పాలకమండలి అధ్యక్షుడు వజినేపల్లి శేఖర్, మండల వైఎస్సార్ సీపీ నాయకుడు భవిరిశెట్టి హనుమంతరావు, టీడీపీ నాయకుడు కన్నెధార వసంతరావు, శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్ ఇంగ్లిషుమీడియం ప్రధానోపాధ్యాయుడు ముత్యాల శ్రీనివాసరావు, శరణం సురేంద్ర, శంకరమంచి పద్మశ్రీలు విశ్రాంత ఉపాధ్యాయులు కలువకొలను నరసింహామూర్తి, వారణాసి వెంకటేశ్వరశర్మలతో పాటుగా వందమంది పూర్వవిద్యార్థులు పూలదండలతో శాలువాలతో ఘనంగా సన్మానించారు.

నేడే ముత్యాలమ్మ తిరుణాళ్ల



మూలవిరాట్ శ్రీముత్యాలమ్మ తల్లి

రాజుపాలెం: మండలంలోని అనుపాలెంకు తూర్పు వైపున ఉన్న కొండపై కొలువుదీరిన ముత్యాలమ్మతల్లి కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి భక్తుల పాలిటి కొంగు బంగారం అంటూ కొలుస్తారు. ముత్యాలమ్మ తల్లిని జంట గ్రామాలైన అనుపాలెం, అంచులవారి పాలెంకు చెందిన గ్రామస్తులు కులదైవంగా పూజిస్తారు. దీనికి గాను అమ్మవారి దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి సుందరంగా తీర్చిదిద్దారు. రెండు గ్రామాల్లోని గృహాల్లో ఏ శుభకార్యం చేయాలన్నా ముందుగా ఆ దేవతకు మొక్కులు చెల్లించి ఆ పనిని ప్రారంభిస్తారు. ఈ ఆదిపరాశక్తికి ఏటా శతాబ్ది కాలం నుంచి సంక్రాంతి పండుగను పురస్కరించుకుని 14వ తేదీ శనివారం తిరుణాళ్ళ నిర్వహిస్తారు. పాడి పంటల భోగభాగ్యాలతో చల్లగా చూసే తల్లికి కులమతాలకు అతీతంగా తొలి ధాన్యపుకంకులు పొంగళ్ల నైవేద్యంగా సమర్పించి చీరా, సారెలతో వాయిద్యాల నడుమ బోణాలను నెత్తిన పెట్టుకుని మొక్కులు తీర్చుకుంటారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి విద్యుత్ ప్రభలు కోలాటాలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అనేక ఉత్సవాలతో రాత్రంతా జాగారం చేస్తారు. ఈ తిరుణాళను ఎంతో వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లను సిద్ధం చేశారు.

భారీ బందోబస్తు......

తిరుణాళ్లలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ ఎస్‌కె షఫీ ఆలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ప్రభలపై రాజకీయ పార్టీల జండాలు, నాయకుల ఫొటోలు, సినీ హీరోల చిత్రాలు ఫ్లెక్సీ బోర్డులు, అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తే ప్రభల నిర్వాహకులపై చర్యలు చేపటతామని ఎస్ఐ హెచ్చరించారు.

మెల్విన్ జోన్స్ చిరస్మరణీయుడు



వృద్ధులకు అన్నసంతర్పణ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

సత్తెనపల్లి: ప్రపంచవ్యాప్తంగా సేవా భావం కలిగిన వేలాది మందిని ఒకే వేదిక మీదకు తీసుకువచ్చి వారి యొక్క సేవలను మరింత విస్తృత పరిచే విధంగా చేసిన మహనీయులు స్వర్గీయ మెల్విన్ జోన్స్ చిరస్మరణీయులని లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి టౌన్ అధ్యక్షుడు లయన్ తవిటి భావనారాయణ అన్నారు. అంతర్జాతీయ లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు స్వర్గీయ మెల్విన్ జోన్స్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని ఆదరణ వృద్ధాశ్రమంలో వృద్ధులకు శుక్రవారం అన్నసంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి లయన్ వల్లూరి శ్రీనివాసరావు, సీనియర్ సభ్యులు లయన్ కంబాల వెంకటేశ్వరరావు, లయన్ తోట సాంబశివయ్య, లయన్ కంకణాల విష్ణువర్ధన్ రావు, లయన్ పొత్తూరి రామకోటయ్య, లయన్ గ్రంధిశిల శ్రీనివాసరావు, లయన్ మంచికంటి వెంకటేశ్వరరావు, లయన్ వేదాంతం కృష్ణమాచార్యులు, లయన్ తిరుమల సాంబశివరావు, ఉన్నారు.

ఎమ్మెల్యే శంకరరావును విమర్శించే అర్హత కొమ్మాలపాటికి లేదు

బెల్లంకొండ: నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావును విమర్శించే స్థాయి కొమ్మాలపాటి శ్రీధర్‌కు లేదని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నేత, ఎంపీపీ చెన్నుపురెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యేపై కొమ్మాలపాటి చేసిన వ్యాఖ్యలను శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన ఖండించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిపై మాట్లాడే హక్కు టీడీపీ నాయకులకు లేదన్నారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన శ్రీధర్ పదేళ్ల కాలంలో చేయలేని అభివృద్ధిని, తమ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మూడున్నర ఏళ్లలో చేసి చూపించారన్నారు. గత పదేళ్లుగా ఎమ్మెల్యేగా ఉండి, గత ఐదేళ్ల అధికార పార్టీలో ఉండి ఎలాంటి అభివృద్ధి చేయలేని తాను అభివృద్ధిపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు రూ.1650 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేశారన్నారు. గ్రామాల్లో కోట్లాది రూపాయలతో శాశ్వతంగా నిలిచే సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ సెంటర్లు నిర్మాణాలు చేశారన్నారు. శ్రీధర్ చేసిన ఇసుక దోపిడితో ఛిద్రమై, మోకాళ్లలోతు గుంతలు పడిన అమరావతి – బెల్లంకొండ రహదారికి తట్టెడు మట్టి వేయలేదని, తమ ఎమ్మెల్యే రూ.150 కోట్లతో డబుల్ రోడ్డుకు నిధులు మంజూరు చేయించారన్నారు. క్రోసూరులో పాలిటెక్నిక్ కళాశాల, నియోజకవర్గంలో పలు వైద్యశాలల నిర్మాణాలను తమ ఎమ్మెల్యే నిధులు తెచ్చి నిర్మాణాలు పూర్తి చేయించారన్నారు. 25 ఏళ్లుగా రామాంజనేయపురం గ్రామంలో ఏ ఎమ్మెల్యే చేయలేని అభివృద్ధి పనులను ఎమ్మెల్యే శంకరరావు ప్రారంభించారన్నారు. ఎమ్మెల్యేపై అవాకులు చవాకులు పేలితే శ్రీధర్‌కు, టీడీపీ నాయకులకు ప్రతీ గ్రామంలో భంగపాటు తప్పదని హెచ్చరించారు. నియోజకవర్గంలో ఇసుక దోపిడీ నుంచి రాజధాని భూములు వరకూ అవినీతి చేసి అవినీతి ఎమ్మెల్యేగా నీ చరిత్ర రాష్ట్ర వ్యాప్తంగా అందరికీ తెలుసని ఎద్దేవా చేశారు. టీడీపీ నాయకుల వలే అధికారం అడ్డుపెట్టుకుని మట్టి అమ్ముకుని డబ్బులు దండుకునే చరిత్ర తమ ప్రభుత్వానిది కాదన్నారు. సమావేశంలో పార్టీ మండల నాయకులు చింతారెడ్డి సాయిరెడ్డి, జిల్లా కార్యదర్శి మర్రి ప్రసాదరెడ్డి, వైస్ ఎంపీపీలు బూదాటి మరియదాసు, అహ్మద్‌పాషా, సొసైటీ పర్సన్ ఇంచార్జ్ భద్రయ్య, సర్పంచ్‌లు ఆసుల జగన్, నరసింహానాయక్, సైదయ్య, రమణారెడ్డి, బ్రహ్మం, నాయకులు మేకల వెంకటేశ్వర్లు, గాదె వెంకటరెడ్డి, నారుమళ్ల రామకోటి, వజ్రాల శ్రీనివాసరెడ్డి, రేగుల గడ్డ శ్రీను, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి స్పెషల్ బస్సులను సద్వినియోగం చేసుకోండి

మాచర్ల : సంక్రాంతి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసి డిపో మేనేజర్ ఆర్.పిచ్చయ్య అన్నారు. హైదరాబాద్, విజయవాడ, కర్నూలు, గుంటూరులకు ప్రత్యేక బస్సులను నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక బస్సులను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకుని ఆర్టీసి బస్సులలో సురక్షితంగా ప్రయాణించాలని ఆయన కోరారు.

నేడు గోదా రంగనాయకుల కల్యాణం

సత్తెనపల్లి: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని వడ్డవల్లి శ్రీ రామాలయం, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం భోగి పర్వదిన సందర్భంగా గోదా రంగనాయకుల కల్యాణం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. చందనోత్సవంతో శ్రీవారి అలంకరణ జరుగుతుందన్నారు. కల్యాణం అనంతరం అన్న సంతర్పణ జరుగుతుందన్నారు. శ్రీవారి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. అలాగే పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్ లో గల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం శ్రీకృష్ణ అవతారంలో శ్రీవారి అలంకరణ చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. అనంతరం గోదా, రంగనాయకుల కల్యాణం జరుగుతుందన్నారు.

పొలంబడిలో రైతులకు శిక్షణ

నకరికల్లు: సాగులో ఎరువుల యాజమాన్యం కీలకమని పిడుగురాళ్ల డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు బి.శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. మండలంలోని గుండ్లపల్లి డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం, నర్సింగపాడు, త్రిపురాపురం గామాల్లోని రైతులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసే సమయంలో విధిగా రశీదులు పొందాలన్నారు. ఈ-క్రాప్ బుకింగ్ నమోదు చేసుకోవడం ద్వారా పండించే వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరే వచ్చే విధంగా విక్రయించుకోవచ్చన్నారు. ప్రకృతి వైపరిత్యాల సమయంలో పంటనష్ట పరిహారం పొందవచ్చన్నారు.

భూసారం దెబ్బతినకుండా నానో యూరియా వాడాలి

వ్యవసాయాధికారిణి ఎమ్.అరుణ



తనిఖీలు చేస్తున్న ఏఓ అరుణ

ముప్పాళ్ళ: రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటపై నానో యూరియా వాడకాన్ని చేపట్టినట్లయితే సాగు వ్యయంతో పాటుగా భూసారం దెబ్బతినకుండా కాపాడుకోవచ్చని మండల వ్యవసాయాధికారిణి ఎమ్.అరుణ చెప్పారు. మండలంలోని నార్నెపాడు, మాదల, ముప్పాళ్ళ గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను శుక్రవారం తనిఖీ చేశారు. మండలంలో సుమారు 1300 హెక్టార్లలో మొక్కజొన్న పంట సాగు చేశారని, పంటలో అధికంగా యూరియా వాడుతున్నారని, దీని వల్ల భూసారం దెబ్బతింటుందన్నారు. ఎకరాకు మూడు కట్టలు యూరియా నీళ్ల బదులుగా ఒక లీటరు నానో యూరియా మొక్కలపై పిచికారీ చేసుకోవచ్చన్నారు. ఈ విధానం వల్ల ఎకరాకు సుమారు రూ.2వేల వరకు ఆదా చేయవచ్చన్నారు. అన్ని ఆర్బీకేల్లోను, సొసైటీల్లోను, ఇతర డీలర్ల వద్ద సరిపడా యూరియా నిల్వలున్నాయన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎక్కడైనా అధిక ధరలకు అమ్మినట్లుగా ఫిర్యాదు అందితే సదరు డీలరుపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

అచ్చంపేట: సంక్రాంతి సంబరాల్లో భాగంగా స్థానిక హరిహర క్షేత్రంలో శుక్రవారం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సందేశాత్మకంగా, సహజత్వం, సాంప్రదాయం ఉట్టిపడేవిధంగా మహిళలు ముగ్గులు వెశారు. మొత్తం 30 మంది పోటీల్లో పాల్గొనగా మొదటి ఆరు స్థానాలు సాధించిన మహిళలకు నిర్వాహకులు సీహెచ్ అప్పారావు బహుమతులను అందజేశారు.